

అలంకరణలో గోవిందరాజస్వామి

రోజంతా నగరంలోనే..



బీటీఎం లే అవుట్ మెట్రోస్టేషన్ వద్ద ట్రయల్ రన్‌లో ఎల్లోలైన్ మెట్రో రైలు

- సుదీర్ఘ కాలం తర్వాత బెంగళూరుకు ప్రధాని మోదీ
- ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో సేవలు జాతికి అంకితం..
- మూడు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా..
- మూడో దశ మెట్రో రైళ్ల పనులకు శంకుస్థాపన
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు.. దారి మళ్లింపు



బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్‌సిటీకి మెట్రో సేవల కల సాకారమైంది. నిర్మాణ ప్రక్రియ, పరిశీలనలు ముగిసిన మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ బెంగళూరుకు రానున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బెంగళూరులో ప్రధాని వివిధ ప్రాంతాల్లో పర్యటించనుండడం ఇదే తొలిసారి. ఢిల్లీ నుంచి బయల్దేరే ప్రధానమంత్రి 10.30 గంటలకు హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడనుంచి హెలికాప్టర్ మార్గంగా ప్యాలెస్ రోడ్డులోని ఎయిర్‌ఫోర్స్ హెడ్‌క్వార్టర్స్ ట్రైనింగ్ సెంటర్‌కు వస్తారు. అక్కడనుంచి రోడ్డు మార్గంలో మెజస్టిక్‌కు వెళ్లి మూడు వందేభారత్ రైళ్లను లాంఛనంగా ప్రారంభిస్తారు. అందులో బెంగళూరు నుంచి బెళగావికి వెళ్లే రైలుకు పచ్చజెండా చూపుతారు. అదే వేదికపై అమృత్‌సర్ నుంచి శ్రీమాతావైష్ణోదేవి కత్రాకు, నాగ్‌పూర్ నుంచి పూనెకు వందేభారత్ రైళ్లను వర్చువల్ రూపంలో ప్రారంభిస్తారు. అక్కడనుంచి సౌత్‌ఎండ్ సర్కిల్‌మీదుగా ఆర్‌వీరోడ్డు రాగిగుడ్డ మెట్రోస్టేషన్‌కు చేరుకుంటారు. ఎల్లోలైన్ మెట్రో రీచ్-5ను ప్రారంభిస్తారు. అనంతరం మెట్రో రైలులోనే ఎలక్ట్రానిక్ సిటీకి చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత మెట్రో ఫేజ్3 పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం వెనుదిరిగి హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఢిల్లీకి బయల్దేరుతారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవలికాలంలో బెంగళూరులో ఒకరోజు పూర్తిస్థాయిలో కార్యక్రమంలో పాల్గొనింది లేదని చెప్పవచ్చు. కాగా కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణ మెజస్టిక్‌లో ప్రధానమంత్రి వందేభారత్ రైళ్లను ప్రారంభించే వేదికలను పరిశీలించారు. ప్రధానమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భద్రతా వర్గాల శనివారం రిహార్సల్స్ సాగాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య కొనసాగింది. ప్రధానమంత్రి ఆదివారం పర్యటించే ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. నగర ప్రజలు ముందుగా అవగాహన కలిగి ఉండాలని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.



మెజస్టిక్ కేఎస్ఆర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కేంద్రమంత్రి సోమణ్ణ

మార్మోగిన గోవిందనామం

- శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాలు కిటకిట

ముళబాగిలు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ముళబాగిలు పట్టణంలోని విల్లేశ్వరపాళ్యలోగల గోవిందరాజస్వామి ఆలయంలో విశేషపూజలు, అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గోవింద నామస్మరణతో భక్తులు దర్శనం చేసుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సిందూరం అలంకరణలో అభయ వరదాంజనేయ స్వామి



బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరనగర్‌లో వెలసిన వరద అభయాంజనేయస్వామిని శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా సిందూరంతో అలంకరించారు. ఉదయం స్వామికి అభిషేకం, అర్చన సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ధనుంజయ తెలిపారు. స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అంజనాద్రిపై భక్తుల సందడి

ఓట్ల చౌర్యంపై న్యాయపోరాటం

- నిపుణులతో చర్చించాలని నిర్ణయం : సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యానికి సంబంధించి న్యాయపోరాటం చేసే విషయమై నిపుణులతో చర్చలు జరపాలని నిర్ణయించినట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. మైసూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం 'ఓట్ అధికార్ ర్యాలీ'లో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రకటించిన అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తామన్నారు. న్యాయపోరాటం చేసేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తామన్నారు. మహదేవపురలో ఓట్ల చౌర్యంలో భాగంగా ఎక్కువమందిని జాబితాలో చేర్చారన్నారు. అయితే రాష్ట్ర సహకారశాఖ మంత్రి రాజణ్ణ, సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకం అనిపించేలా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు 2024లో జరిగాయని అప్పటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, మన పాలనలోనే ఓటరు జాబితాలో మార్పులు జరిగినట్లు అయ్యిందన్నారు.

ఆధార్ లింక్ చేయాలి: కేంద్ర మంత్రి కుమార



మరోవైపు కేంద్రమంత్రి కుమారస్వామి ఓట్లచౌర్యం సాగుతున్న వివాదానికి సరికొత్త సలహా ఇచ్చారు. ఓటరు కార్డుకు ఆధార్‌సంఖ్యను పూర్తిస్థాయిలో అనుసంధానంచేస్తే ఓట్ల చౌర్యం అనే ఆరోపణలు ఉండవని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానమైతే రెండుమూడుచోట్ల ఓటు హక్కు ఉండదని, పోలింగ్‌లో కూడా పాల్గొనలేరన్నారు. ఓట్ల చౌర్యం అనేది కేవలం కొందరి కపట కథనమన్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతానన్నారు. అమృతకాలంలో ప్రజాప్రభుత్వంపై విషం చల్లే ఘోరమైన కుట్ర జరుగుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగబద్ధ సంస్థలపై తప్పుడు ఆరోపణల ద్వారా అనుమానాలు పుట్టించి ప్రయోజనం పొందాలని భావిస్తున్నారన్నారు. గత మూడేళ్లలో రాష్ట్రప్రభుత్వం 3లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. జీడీపీ రుణశాతం 24.91శాతం అయ్యిందన్నారు. గ్యారెంటీలకే ఏటా రూ.55 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అభివృద్ధికి నిధులు లేవని బహిరంగంగా చెబుతున్నారన్నారు. రాహుల్‌గాంధీ బెంగళూరుకు వచ్చే ముందే 13 ప్రశ్నలు వేశానని వాటికి సమాధానం చెప్పలేదన్నారు. అసత్య ఆరోపణలు చేసే బదులు నిజాలతో అక్రమాలను బయట పెట్టాలన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాంగ్రెస్ నాయకుల లక్ష్యమన్నారు.

సంప్రదాయ మీడియాకు విశ్వసనీయత

- సాహితీవేత్తలు.. పత్రికలపై ఆధారపడటం లేదు
- బుక్‌బ్రహ్మ చర్చాగోష్ఠిలో కె.శ్రీనివాస్

బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ మీడియా అయిన దినపత్రికలు, టెలివిజన్ చానెళ్లకు విశ్వసనీయత ఉందని, వాస్తవానికి దగ్గరగా ఉంటాయనే అభిప్రాయం సమాజంలో ఉందని ప్రముఖ రచయిత, ఆంధ్రజ్యోతి పూర్వపు ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. 'బుక్ బ్రహ్మ సాహితీ ఉత్సవ్'లో భాగంగా శనివారం ఎసమకాలీన మీడియాలో సాహిత్యానికి లభిస్తున్న స్థానంర్ అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. రష్మి వాసుదేవ్, సుదీశ్ వెంకటేశ్, మయూర శ్రేయాన్సు కుమార్, ఐశ్వర్య ఇందులో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత ఆధునికంగా వచ్చిన విధానమని అన్నారు. తెలుగు పత్రికలలో ఏఐ పూర్తిస్థాయిలో అనుసంధానం కాలేదని అన్నారు. కంటెంట్ కోసం భవిష్యత్తులో ఉపయోగించుకునేందుకు వీలుండవచ్చునని, ప్రస్తుతానికి తెలుగు పత్రికలు సంపూర్ణంగా ఏఐతో అనుసంధానం కాలేదని అన్నారు. ఇంగ్లిష్ తరహాలో ఏఐ ప్రాంతీయ భాషలలో పత్రికా జర్నలిజానికి పరోక్షంగా ఉపయోగపడవచ్చునని, ప్రత్యక్షంగా కాదని అన్నారు. ఏఐతో ఆందోళన అవసరం లేదని అన్నారు. కంటెంట్, సరళి, రాసే విధానంలో తెలుగు పత్రికలు ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. డిజిటల్ మీడియా ఆధునికంగా, వేగంగా ఉందని, అయితే విశ్వసనీయత పూర్తిగా లేదని అన్నారు. ఆధునిక జర్నలిజం, సంప్రదాయ మీడియా కలిస్తే మంచి మీడియా రావచ్చునని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పత్రికలపై పూర్తిగా ఆధారపడ్డారని, వారి రచనల ప్రచురణతోపాటు అన్నింటికీ పత్రికలే కీలకమైనవిగా ఉండేవని అన్నారు. కార్యక్రమాల షెడ్యూల్‌లను ప్రచురితం చేయాలని డిమాండ్ చేసేవారని, ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా వారే ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు.



చర్చాగోష్ఠిలో ఆంధ్రజ్యోతి పూర్వపు ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు

ఆలయానికి యాచకురాలి విరాళం

- రూ.1.83 లక్షల అందజేత



దాత రంగమ్మ


రాయచూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గడచిన 30 ఏళ్లుగా తమ గ్రామ పరిసరాల్లోనే ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలు ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. రాయచూరు తాలూకాలోని బిజనగేరా గ్రామంలో నిర్మిస్తున్న అంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి అదే గ్రామంలో ఉన్న బిక్షగత్తె రంగమ్మ బిక్షాటన ద్వారా పోగుచేసిన రూ.1.83 లక్షలను గ్రామస్థులకు అందజేశారు. ఇటీవల రెండు రోజుల క్రితం నాణేలు, కరెన్సీ నోట్లు కొన్ని కవర్లలో మూట గట్టుకుని ఉన్న రంగమ్మ గ్రామస్థులకు అందజేసింది. లెక్కించిన గ్రామస్థులు రూ.1.83 లక్షలు ఉన్నట్లు తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఈ మొత్తాన్ని ఏమి చేస్తావంటూ ప్రశ్నించగా ఆలయ నిర్మాణానికి దానంగా ఇవ్వనున్నట్లు చెప్పడంతో అందరూ నివ్వెరపోయారు. దానం చేయాలంటే శ్రీమంతులే ఉండాల్సిన పని లేదని మనస్సు పెద్దదైతే చాలంటూ పలువురు ప్రశంసిస్తున్నారు.



భిక్షాటన సొమ్ము

అమలు ఎప్పుడో..?

- కుల వర్గీకరణ స్వీకరించిన కేబినెట్
- చర్చకు వారం వాయిదా
- 17శాతం రిజర్వేషన్లకు సిఫారసు



సీఎం సిద్దరామయ్యకు నివేదిక అందజేస్తున్న జస్టిస్ నాగమోహన్ దాస్ బృందం (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలకుపైగా ఎస్సీ కులాల వర్గీకరణకు అనుకూలంగా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సూచనతో ఇప్పటికే పలు రాష్ట్రాలు వర్గీకరణ చేసి రిజర్వేషన్లు ప్రకటించాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉన్నా కర్ణాటకలోనూ వేగవంతంగా వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ పెరిగింది. రాష్ట్రప్రభుత్వం నియమించిన మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్ సుదీర్ఘకాల సర్వే జరిపింది. సదరు నివేదికను ప్రభుత్వానికి ఇటీవలే సమర్పించింది. జస్టిస్ నాగమోహన్‌దాస్ నివేదికను మంత్రివర్గం స్వీకరించింది. మంత్రులకు కాపీలు చేరడంతో ఎస్సీ జనాభాతోపాటు సిఫారసుల వివరాలు బహిరంగమయ్యాయి. ఎస్సీ ఉపకులాల్లో రెండు గ్రూప్‌లకు ఒకశాతం, మిగిలిన 3 గ్రూప్‌లకు 4-6శాతం రిజర్వేషన్‌గా సిఫారసులు ఉన్నాయనేది తేలింది. దీంతో మంత్రులతోపాటు సంబంధిత ఉపకులాల నుంచి ఏ విధమైన ప్రతిస్పందన వస్తుందనేది వేచి చూడాల్సి ఉంది.

16న కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

ఎస్సీ వర్గీకరణ సర్వే నివేదికపై ఈనెల 16న శనివారం చర్చించాలని తీర్మానించారు. వారం రోజుల్లో మంత్రులు నివేదికపై అధ్యయనం చేసి వారి అభిప్రాయాలను తెలపాలని ముఖ్యమంత్రికి సూచించారు. ఇదే తరహాలోనే కొన్ని నెలలక్రిందట బీసీ కులగణన నివేదికను ప్రభుత్వం స్వీకరించింది. ఆ తర్వాత కేబినెట్‌లో చర్చకు ప్రస్తావన వచ్చింది. అయితే మంత్రులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో గందరగోళంగా మారింది. లింగాయత, ఒక్కలిగల జనసంఖ్య ఎక్కువగా ఉందని నివేదికల్లో ఉండడంతో రెండు సామాజిక వర్గాల పెద్దలతోపాటు మంత్రులు వ్యతిరేకించారు. ఈలోగానే పార్టీ అధిష్ఠానం కూడా పదేళ్లకిందట జరిగిన సర్వేను అమలు చేయలేమని తేల్చి చెప్పారు. దీంతో కులగణనకు సంబంధించి పదేళ్లకసరత్తు 150 కోట్ల రూపాయలకుపైగా ప్రజాధనం వృథా అయ్యింది.

రిజర్వేషన్ అమలుకు కమిషన్ సిఫారసులు			
కేటగిరీ	కులాల సంఖ్య	జనాభా	రిజర్వేషన్ శాతం
ఏ	59	5,22,099	1
బీ	18	36,69,246	6
సీ	17	30,08,633	5
డీ	4	28,34,939	4
ఈ	3	4,74,954	1
	101	1,05,09,871	17

కేటగిరీల వారీగా..

కేటగిరీ 'ఏ'లో అత్యంత వెనుకబడిన సామాజికవర్గాలు, సూక్ష్మ, అతిసూక్ష్మ, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబాటుతో ఉన్న 59 కులాలు, బీ కేటగిరీలో వెనుకబడిన మాదిగతోపాటు 18 ఉపకులాలు, సీ కేటగిరీలో 17 ఉపకులాలు, డీ కేటగిరీలో లంబాని, బోవి, కొరమ, కొరచతోపాటు నాలుగు కులాలు, ఈ కేటగిరీలో మూల కులం తెలపకుండా ఆది ఆంధ్ర, ఆది కర్ణాటక, ఆది ద్రావిడ కులాలు ఉన్నాయి.

నివేదికకు మద్దతు

సర్వేలో 1.07 కోట్లమంది జనాభాకు అనుబంధంగా వెనుకబడిన సామాజిక, ఆర్థిక పరిస్థితిని శాస్త్రీయంగా నమోదు చేశారు. సర్వేలో ఎవరినీ వదలకుండా ఇంటింటికీ వెళ్లి బ్లాక్‌స్థాయిలో జరిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఎటువంటి చిన్న విమర్శకు అవకాశం లేకుండా సమీక్ష కొనసాగించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా 101 కులాల స్థితిగతులపై నివేదిక ద్వారా ఎంపిరికల్ గణాంకాల ఆధారంగా రిజర్వేషన్ కేటాయింపు చేశారు.

వ్యతిరేకం...

సాంకేతిక సమస్యతో వేలాది కుటుంబాలు అంకెలు, అంశాలు రద్దయ్యాయి. మళ్లీ సర్వే జరగలేదు. దీంతో అంకెలు, అంశాలు కమిషన్‌కు లభించడం పట్ల అనుమానాలు ఉన్నాయి. కులాలు లేని ఆదికర్ణాటక, ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ విభాగాలకు ఒకశాతం రిజర్వేషన్ అమలు సాంకేతికం కాదనే అభిప్రాయాలు ఉన్నాయి. మాదిగ కులాల్లో చేరాల్సినవారికి ఉద్దేశపూర్వకంగా వదులుకున్నారు. వినతులకు పరిష్కారం చూపడం లేదని, అభ్యంతరాలకు అవకాశం కల్పించకుండా ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం అక్రమం, అన్యాయం అనే అభిప్రాయాలు ఉన్నాయి. ఏకపక్షంగా చట్టవ్యతిరేకంగా చేశారనే విమర్శలు ఉన్నాయి.
మంత్రివర్గ సమావేశంలో ఏకాభిప్రాయం సాధ్యమైతే వర్గీకరణ సర్వే నివేదికకు అంగీకారం లభించే అవకాశం ఉంటుంది. సర్వే జరిగినప్పుడు లోపాలు, సాంకేతిక, చట్టపరమైన అభ్యంతరాలను ఓ నివేదిక చేయాల్సి ఉండేది. ప్రస్తుతం నివేదిక ఏకపక్షంగా, అశాస్త్రీయంగా ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. మరో వారం రోజులలో మంత్రివర్గ సమావేశంలో ఎటువంటి తీర్మానం చేస్తారనేది వేచి చూడాల్సి ఉంది. అయితే రిజర్వేషన్లు అమలు చేస్తే మరో వర్గం ప్రభావం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.



నెల్లాడి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న నారళ్ల వాగు

భారీ వర్షానికి నీట మునిగిన పంటలు

కంప్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకాలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం ఉదయం నెల్లాడి వద్ద వుండే నారళ్ల వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పొలాల్లోకి నీరు చేరుకుని వరి పంటలు నీటిపాలయ్యాయి. రెండు మూడు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. ఒక్క రోజు రాత్రే కురిసిన భారీ వర్షాలకు ఎటు చూసినా నీరు జలపాతాలు కనిపిస్తున్నాయి. పొలాల్లో నీరు చేరడంతో నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామసాగర్ వద్ద నీట మునిగిన వరి పైర్లు

వైసీపీ పాపాలు..!

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భూఅక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. భూకబ్జాలతో పేట్రేగిపోయారు. ఆ పార్టీకి చెందిన నేతలు.. రియల్టర్ల అవతారమెత్తి నిబంధనలకు తిలోదకాలిచ్చారు. యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేసి, అడ్డంగా దోచుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారు. కూటమి ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తేవడంతో అక్రమాలు బయటపడుతున్నాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనలో అనంతపురం హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో 700కిపైగా లేఅవుట్లు 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. వీటిలో 80శాతానికిపైగా వైసీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు.. అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అనధికార లేఅవుట్లను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వెంచర్లను క్రమబద్ధీకరించే పనిలో పడింది. ఈ ప్రక్రియలో అసలు విషయం బయటకు వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అహుడాలోనే పనిచేస్తున్న ఓ ఇంజనీరు.. వైసీపీ నేతలతో అంటకాగినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ ఇంజనీరును అహుడాలోనే కొనసాగిస్తుండడం గమనార్హం. ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో 700కిపైగా ఉన్న అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్న 40వేల మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని అహుడా వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. డెవలప్‌మెంట్ చార్జీలు, ఫీజులు చెల్లించకుండా అక్రమంగా లేఅవుట్లు వేసేశారు. కొందరు అధికారులు.. వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అహుడాలో పనిచేసే ఓ ఇంజనీరు.. వైసీపీ నాయకులతో బహిరంగంగానే చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే చర్చ సాగుతోంది. గతంలో ఆ ఇంజనీరు అనంత నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేసిన సమయంలోనే భారీగా అక్రమార్జనకు మరిగారనే పేరు మూటగట్టుకున్నారు. తననెవరూ ఏమీ చేసుకోలేరనే ధీమాతోనే అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఆ ఇంజనీరు పనిచేస్తుండడం గమనార్హం.

నగర శివారులోనే అధికం

అనంతపురం నగర శివారులోనే అత్యధికంగా అనధికార లేఅవుట్లు వెలిశాయి. గోవిందంపల్లిలో సర్వే నంబర్లు 78, 145, 165, వడియంపేట గ్రామ పంచాయతీ పొడరాళ్ల పరిధి సర్వే నంబర్ల 295, 279, 84, 85, 87లో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను ఇటీవల అహుడా అధికారులు తొలగించారు. నారాయణపురం పంచాయతీలోని సర్వే నంబరు 104, 202లో (10.8 ఎకరాలు), సర్వే నంబరు 142,145లలో (2.8 ఎకరాలు). నరసనాయునికుంట పంచాయతీలో సర్వే నంబరు 111, 117లలో (6.5 ఎకరాలు), సర్వే నంబరు 113లో ఎకరం, సర్వే నంబరు 121లో (6.4 ఎకరాలు), సర్వే నంబరు 124, 126లలో (4.6ఎకరాలు), కక్కలపల్లి పంచాయతీలో సర్వే నంబరు 191లో (8ఎకరాలు), సర్వే నంబరు 183లో (2.1ఎకరాలు), సోము లదొడ్డి పంచాయతీలో సర్వే నంబరు 62లో (11.5) ఎకరాల్లో వేసిన అనధికార లేఅవుట్లలోని రాళ్లను ఆయా పంచాయతీ కార్యదర్శులతో కలిసి అహుడా ప్లానింగ్ అధికారులు తొలగించారు.

అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే

-టీసీ వరుణ్, అహుడా చైర్మన్

అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లు అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న అనధికారి లేఅవుట్ల వివరాలను సేకరించి, ఎల్‌ఆర్‌ఎస్ వర్తింపజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

చిన్నారుల వృక్షా బంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న విలువల బడుల్లో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ రోజున విద్యార్థులందరూ తాము నాటిన చెట్లకు రాఖీలు కడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విలువల బడుల ఉపాధ్యాయులు నాగరాజు, దిలీప్, అనిత, మల్లికార్జున, ఆశాలక్ష్మి, శ్రీలత, రఘువరన్, హనుమంతరాయుడు, కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. రక్షాబంధన్ రోజున మానవ సంబంధాలను, విలువలను తెలియజేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్‌కే లెనిన్ బాబు అభినందించారు.

దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ

ఎంఎస్ రాజుకు రాఖీ కట్టిన పల్లె సింధూర



ఎంఎస్ రాజుకు రాఖీ కడుతున్న సింధూరారెడ్డి

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టారు. నగరంలోని ఎంఎస్ రాజు నివాసానికి శనివారం సింధూరా రెడ్డి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం ఆమెకు రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని పల్లె సింధూర పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి రూ. 6.47లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ 14 నెలల్లోనే సుమారు రూ 1.75 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి సాయం ఎవరికీ అందలేదన్నారు. జగన్ పాలనంతా ప్రజావ్యతిరేకంగానే సాగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్యచౌదరి, కోనంకి గంగారామ్, అహ్మద్, కడియాల కొండన్న, చేపల హరి, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, సుధాకర్ యాదవ్, లక్ష్మీ నరసింహ, దుర్గేష్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

వేతనం ఎప్పుడో..?

పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు

నేటికీ అందని వేతనం... పట్టించుకోని విద్యాశాఖ



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల మూల్యాంకన వేతనాలు విద్యాశాఖ ఎప్పుడు ఇస్తుందోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలైనా ఇంతవరకు చెల్లింపుల్లేవు. దూరప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యాయులు మూల్యాంకన వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున 6 వేల వరకు, సహాయకులకు 3 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 1,500 మంది టీచర్లకు రూ.72.8 లక్షలు, 200 మంది సహాయకులకు రూ.13.09 లక్షలు మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లాస్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రూపంలో వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన సొమ్మును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా, ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాంకన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. కావున, పరీక్షల ప్రక్రియకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు జాప్యం చేస్తే జరిమానాలు వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తుందో అర్థం కావడంలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఏటా ఇదే తంతు

పదో తరగతి మూల్యాంకన చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన వేతనం నేటికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దాదాపు పది రోజులపాటు ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. ఇతరప్రాంతాల నంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



వెంటనే చెల్లించాలి

మూల్యాంకన వేతనాలు అధికారులు వెంటనే చెల్లించాలి. జిల్లాలో చాలామంది టీచర్లు సొంత ఖర్చులు పెట్టుకుని మూల్యాంకనానికి హాజరయ్యారు. మామూలుగా మూల్యాంకనం జరిగిన వెంటనే ఇవ్వాలి. అసలు మూల్యాంకనం రుసుం ప్రభుత్వం నుంచి విడుదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారులే ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్తులో మూల్యాంకన విధులు అంటనే ఉపాధ్యాయులు వెనకడుగు వేస్తారని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి.

-సానె రవీంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరగా ఇవ్వాలి

- సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి, యూటీఎఫ్



ప్రభుత్వం మూల్యాంకన వేతనాన్ని త్వరగా చెల్లించాలి. మూల్యాంకనం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనం చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటి? విద్యాశాఖ అధికారులు కూడా ఉపాధ్యాయులతో పని చేయించుకుని వారికి వేతనం ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు.

మూడు రోజుల్లో జమవుతుంది

-కిష్టప్ప, డీఈఓ

పదో తరగతి మూల్యాంకనం చేసిన టీచర్లకు వేతనం మూడు రోజుల్లో వారి ఖాతాల్లోకి జమవుతుంది. బడ్జెట్ వచ్చింది. వేతనాల బిల్లులు ట్రెజరీకి పంపాం. మూడు రోజుల్లో వేతనం జమవుతుంది.



కసాపురంలో స్వామికి అలంకరణ



నేమకల్లులో..



మురడిలో...



నేమకల్లులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జై హనుమాన్

అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

గుంతకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి, శనివారం కావడంతో జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్లకు గజ వాహనోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్టుకు వేకువనే అభిషేకాలు చేశారు. వజ్రఖచిత స్వర్ణాభరణ అలంకారాలు చేశారు. సెలవు దినం కూడా కావడంతో ఉదయం నుంచీ రాత్రి 9 గంటల వరకూ ఇసుకేస్తే రాలనంత మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. దీంతో పట్టణంలో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. క్యూలైన్లను నియంత్రించడానికి పోలీసులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం గజ వాహనంపై శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

నేమకల్లు కిటకిట..

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. సర్వదర్శనానికి 2 గంటలుపైగా పట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, కంప్లి మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు.. స్వామివారిని దర్శించుకున్నారు.

మార్మోగిన అంజన్న నామం

డీ హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామం అంజన్న నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటకలోని కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను ఉప లోకాయుక్త రజని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎఫ్ రోడ్డు, రామ్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

పుస్తకావిష్కరణ సభకు తరలిరండి

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో పుస్తకావిష్కరణ సభ జరగనుందని, విజయవంతం చేయాలని జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. అందులో సీనియర్ కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' కవితా సంపుటిని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నామనీ, ఉమ్మడి జిల్లాలోని టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన బోధన, విద్యార్థుల అభ్యున్నతికి కృషి, క్రమశిక్షణ కలిగిన టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల టీచర్లు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని జయచంద్రారెడ్డి కోరారు. వివరాలకు 9030944717 నంబరులో సంప్రదించాలన్నారు.

బీఏఎస్‌ను పునరుద్ధరించాలి

- ఎమ్మార్పీఎస్

అనంతపురం వైద్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదివించేలా బెస్ట్ అవలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు సీఎంగా ఉన్న చంద్రబాబు బీఏఎస్‌ను తీసుకొచ్చారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ పథకాన్ని తొలగించారన్నారు. దీంతో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గత ఐదేళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు దూరమయ్యారని వాపోయారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో బీఏఎస్‌పై వారి తల్లిదండ్రుల్లో ఆశలు పెరిగాయన్నారు. అయితే ఏడాది గడిచినా బీఏఎస్‌పై ప్రభుత్వం మాట్లాడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బీఏఎస్‌ను పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు అంజినప్ప, ఉదయ్‌కుమార్, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీరో డౌన్ పేమెంట్... జీరో ఇంట్రెస్ట్‌తో కొత్త కార్లు ఇప్పిస్తానని నమ్మబలికి డ్రైవర్లకు కుచ్చుటోపీ పెట్టాడు ఓ మోసగాడు. జాతీయ రహదారి పనులు చేసే సంస్థలో అద్దెకు పెట్టిస్తానంటూ డబ్బు వసూలు చేసి, ఉడాయించాడు. గార్లదిన్నెలో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన రమేష్, దేవరాజు, నాగరాజు, వెంకటేష్, తిమ్మయ్య కారు డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు. వారికి గార్లదిన్నెలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె ఎన్‌హెచ్‌ఏఐలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నానని చెప్పింది. సాయి అనే వ్యక్తి తనతోపాటు ఉద్యోగం చేస్తున్నాడని అతడిని డ్రైవర్లకు పరిచయం చేసింది. తనది రాజమండ్రి అనీ, తాను ఎన్‌హెచ్‌ఏఐలో ఉద్యోగం చేస్తున్నానని అతడు చెప్పాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎన్‌హెచ్ పనులు చేపడుతున్నారనీ, అందులో చాలామంది ఉద్యోగులున్నారన్నారు. కార్యాలయం మాత్రం అనంతపురంలో ఉందన్నాడు. ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నారని నమ్మబలికారు. అందుకు కార్లు అద్దెకు కావాలని తెలిపారు. ఎన్‌హెచ్ పనులు ఐదేళ్లు ఉంటాయనీ, జీరో డౌన్‌పేమెంట్‌తో కార్లు ఇప్పిస్తానని డ్రైవర్లకు ఆశ చూపాడు. డీజిల్ అంతా కంపెనీనే భరిస్తూ కారుకు నెలకు రూ.40వేలు, డ్రైవర్‌కు రూ.17వేలు మొత్తం రూ.57వేలు ఇప్పిస్తానన్నాడు. కార్లకు బాడుగలు లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తరుణంలో డౌన్ పేమెంట్, వడ్డీ లేకుండా కొత్తకార్లు వస్తాయని చెప్పడంతో డ్రైవర్లు నమ్మారు. 5 సంవత్సరాలు అగ్రిమెంట్ చేయాల్సి ఉంటుందని సాయి నమ్మబలికాడు. అందుకు డ్రైవర్లు ఓకే చెప్పారు. అగ్రిమెంట్‌కు ఒక్కొక్కరు రూ.10వేలు... కారు బుకింగ్ కోసం రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇందుకు డ్రైవర్లు ఒక్కొక్కరు రూ.10వేలు ఫోన్ పే చేసి, రూ. 50వేలు నగదు రూపంలో సాయికి అందజేశారు. ఇలా ఐదుగురు మొత్తం రూ.3 లక్షలు ముట్టజెప్పారు. మూడు నెలలు కావస్తున్నా కొత్తకార్లు రాలేదు. డ్రైవర్లకు అనుమానం వచ్చి సాయికి ఫోన్ చేశారు. అదిగో...ఇదిగో.. అంటూ కాలయాపన చేయసాగాడు. 'నాతో డబ్బుల్లేవు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరించాడు. దీంతో సాయిని పరిచయం చేసిన మహిళను డ్రైవర్లు నిలదీశారు. తనకు సంబంధం లేదని మహిళ చెప్పింది. ఆమెతో కారు డ్రైవర్లు వాదనకు దిగారు. తాను కూడా కార్ల కోసం డబ్బు కట్టి, మోసపోయానని మహిళ వాపోయింది. దీంతో కారు డ్రైవర్లు, మహిళ.. పోలీసులను ఆశ్రయించారు. సాయి అనే వ్యక్తి తమకు కార్ల ఆశ చూపి మోసం చేశాడనీ, న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో త్రీటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నా, పెద్దా లేదా అంటూ గుర్తు తెలియని వ్యక్తి దండించాడన్న కోపంతో పిడిగుద్దులు గుద్దడంతో అతడు స్పృహతప్పి పడి మరణించాడు. దాడి చేసి పారిపోయిన నిందితుడిని త్రీటౌన్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. శనివారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలప్పుడు శ్రీనివాసనగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద ఘర్షణ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన చిన్న వెంకటరాముడు(50) స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీనివాసనగర్‌లోని రాముని గుడి వద్ద నివాసం ఉండేవాడు. ఆయన అన్న క్యాంటీన్ వద్ద ఉండగా, వినాయకనగర్‌కు చెందిన బర్గోళ్ల రామంజి అలియాస్ రామాంజనేయులు(33) అక్కడికి వచ్చాడు. నిలబడిన ఉన్న చిన్న వెంకటరాముడిని మాట్లాడిస్తూ... 'మావాళ్లు ఏమైనా ఇక్కడ వచ్చినారా ఓయ్...!' అన్నాడు. దీంతో వయసురీత్యా పెద్ద అయిన చిన్న వెంకటరాముడు 'నువ్వు ఎవరు నన్ను అడుగుతావు... చిన్న, పెద్ద తేడా లేదా..?' అంటూ దండించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపం మీద ఉన్న రామాంజనేయులు ఒక్కసారిగా వెంకటరాముడు మొహం, ఛాతీపై మూడు, నాలుగుసార్లు పిడిగుద్దులు గుద్దాడు. దీంతో చిన్న వెంకటరాముడు స్పృహతప్పి పడి, మరణించాడు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంతో నిందితుడిని రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

విస్తారంగా వర్షాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా వజ్రకరూరులో 86.2 మి.మీ, వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 70.4, శెట్టూరు 68.4, బెళుగుప్ప 65.4, విడపనకల్లు, తాడిపత్రి 61.4, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం 58.2, పెద్దవడుగూరు 52.4, యల్లనూరు 49.8, యాడికి 48.4, గార్లదిన్నె 46.4, కంబదూరు 45.4, ఉరవకొండ 45.2, రాయదుర్గం 43.2, కుందుర్పి 39.6, కళ్యాణదుర్గం 39.0, అనంతపురం 32.4, గుంతకల్లు 30.2, శింగనమల 28.4, పామిడి 25.2, కణేకల్లు, రాప్తాడు 21.0, డి.హిరేహాళ్, బుక్కరాయసముద్రం 20.2, పుట్లూరు 19.4, కూడేరు 18.4, నార్పల 16.6, పెద్దపప్పూరు 9.6, బొమ్మనహాళ్ 4.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

'బీసీలకు 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉపాధి, చట్టసభల్లో 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జేఏసీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5శాతం ఉన్న అగ్రవర్ణాలే ఆధిపత్యం చలాయిస్తుంటే... 56ఉన్న బీసీలు బానిసలుగా బతకాల్సివస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి బీసీలకు 27శాతం రిజర్వేషన్లు వస్తున్నాయని, పాలకులు మారినా బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్, తెలంగాణ రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా జనాభాకు అనుగుణంగా బీసీలకు 49శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, నరేష్, అభిరామ్, పార్థు, గోవర్ధన్, ప్రేమానంద్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌కు ఏకలవ్యుడి పేరు పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో టవర్‌క్లాక్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌కు ఏకలవ్యగా నామకరణం చేయాలని ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట రామయ్య కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్‌ఓ మలోలాను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బ్రహ్మయ్య, చంద్రప్ప, చిన్నలింగన్న, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


అండర్ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్‌డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షం వచ్చినా లోతట్టు ప్రాంతాలు వరదల్లో చిక్కుకుని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారుల్లో సైతం వర్షం నీరు నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆక్రమణకు గురైన మురుగుకాలువలను క్రమబద్ధీకరించి వెడల్పు చేయాలని విన్నవించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వీవీ గిరి (జయంతి)



'భారతరత్న' పురస్కార గ్రహీత వరాహగిరి వేంకట గిరి (వీవీ గిరి) 1894 ఆగస్టు 10న ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్‌లో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు. దేశ నాల్గో రాష్ట్రపతిగా 1969 నుంచి 1974 వరకు వ్యవహరించారు. ఇంత వరకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి ఆయనే. కాగా మహాత్మాగాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణోద్యమంలోనూ, స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. పరిశ్రమలు, కార్మికుల సమస్యలపై పలు పుస్తకాలు రాశారు. ఆయన జ్ఞాపకాలతో 'మై లైఫ్ అండ్ టైమ్స్' పేరిట పుస్తకం విడుదలైంది. 1980 జూన్ 24న కన్నుమూశారు.

శంకరంబాడి సుందరాచారి (జయంతి)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ...' రచించిన శంకరంబాడి సుందరాచారి 1914 ఆగస్టు 10న తిరుపతిలో జన్మించారు. ఆయన మాతృభాష తమిళం. గొప్ప కవి, పద్యకవిత్వం ఆయన ప్రత్యేకత. తేటగీతిలో ఎన్నో పద్యాలు రాశారు. మహాత్మాగాంధీ హత్య జరిగినప్పుడు ఆవేదనతో 'బలిదానం' అనే కావ్యం రాశారు. రవీంద్రుని 'గీతాంజలి'ని అనువాదం చేశారు. ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం, ఇతర రచనలు, సినిమాలకు పాటలు రాశారు. 1977 ఏప్రిల్ 8న పరమపదించారు. ఆయన జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుచానూరులో కాంస్యవిగ్రహం ఏర్పాటు చేసింది.

జువాన్ మాన్యుయెల్ స్యాంటోస్ (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత జువాన్ మాన్యుయెల్ స్యాంటోస్ 1951 ఆగస్టు 10న జన్మించారు. కొలంబియా దేశ రాజకీయనేత. 2010 నుంచి 2018 వరకు కొలంబియా దేశ అధ్యక్షులుగా వ్యవహరించారు. 'సోషల్ పార్టీ నేషనల్ యూనిటీ' సహ సంస్థాపకులు. 2016లో నోబెల్ అవార్డు అందుకున్నారు. వృత్తిరీత్యా ఆర్థికవేత్త, వ్యాపారరీత్యా జర్నలిస్టు. ఇంటర్ అమెరికన్ డైలాగ్స్ డిస్టింగ్విష్డ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ పీస్, నేషనల్ జాగ్రఫిక్ సొసైటీచే హానర్, గ్లోబల్ స్టేట్స్‌మన్ అవార్డ్ ఇతరత్రా అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

సాయి ప్రణీత్ (పుట్టినరోజు)



భమిడిపాటి సాయి ప్రణీత్ 1992 ఆగస్టు 10న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో 8వ యేటనుంచే తర్ఫీదు పొందారు. 2019లో బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. ప్రకాశ్ పదుకొనె తర్వాత బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 36 ఏళ్ల అనంతరం టైటిల్ సాధించి 'అర్జున' అవార్డుతో సత్కరించబడ్డారు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ ప్రాతినిధ్యం వహించారు. 2024 మార్చిలో రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం యూఎస్‌లో కోచ్‌గా కొనసాగదలిచారు.

కఠోర శ్రమతోనే విజయానికి మార్గం

ఏఎంసీ స్నాతకోత్సవంలో వీటీయూ ఉపకులపతి



పట్టాలు ప్రదానం చేస్తున్న వీటీయూ వైస్‌చాన్స్‌లర్ విద్యాశంకర్

బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కఠోర పరిశ్రమతోనే విజయానికి మార్గమనేది తెలుసుకోవాలని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ విద్యాశంకర్ అభిప్రాయపడ్డారు. బన్నేరుఘట్ట రోడ్డులోని ఏఎంసీ కళాశాల స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఏఎంసీ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేఆర్ పరమహంస అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 1500మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి విద్యాశంకర్ మాట్లాడుతూ ఏఐ సాంకేతికత, క్వాంటమ్ కంప్యూటింగ్‌తోపాటు కఠినం అనిపించే ఇంజనీరింగ్ రంగంలోనూ ఇంజనీర్ల కొరత ఉందని అధిగమించేందుకు విద్యార్థులు నైపుణ్యత పెంచుకోవడమే కీలకమన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందామంటే పోటీ ప్రపంచంలో ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. నైపుణ్యతతోపాటు ఆధునాతన సాంకేతిక విధానాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. విద్యార్థులు ఎప్పటికీ నైతిక విలువలు కోల్పోరాదన్నారు. చైర్మన్ పరమహంస మాట్లాడుతూ ఏఎంసీలో గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని అందుకే వీటీయూ మా కళాశాలకు అటానమస్ గుర్తింపు ఇచ్చిందన్నారు. మేం సొంతంగా పాఠ్యాంశాలను రూపొందించుకునేందుకు సహాయకారి కానుందన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసినవారు ఉద్యోగాల వేట కాకుండా ఉద్యోగాల కల్పన దిశగా సాగాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ గీతా పరమహంస, ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ రాహుల్ కలూరి, డైరెక్టర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజు పాల్గొన్నారు.

కైవారలో పౌర్ణమి పూజలు

శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల కిటకిట





లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అలంకరణ, గడిదంలో..

చింతామణి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార క్షేత్రంలో సద్గురు యోగినారేయణమఠంలో శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని శని వారం విశేషపూజలు కొనసాగాయి. శ్రీదేవి, భూదేవి సమేత అమర నారాయణస్వామి, సద్గురు తాతయ్య ఉత్సవమూర్తులకు అభిషేకం, అష్టావధాన సేవ నిర్వహించారు. మహామంగళారతి అనంతరం రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాదసుధారస కళాకారులచే సంకీర్తన జరిగింది. కాగా ఆలంబగిరి ఆలయం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని ఆలంబగిరి కొండ ప్రకృతి రమణీయత నడుమ సంకీర్తనా గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరిగింది. కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: శ్రావణ శనివారం పురస్కరించుకుని తాలూకాలోని వివిధ దేవాలయాలలో అభిషేకం, విశేష అలంకరణ, పూజలు జరిగాయి. తాలూకాలోని పురాణ ప్రసిద్ధ గడిదంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అశ్వత్థనారాయణస్వామి నేతృత్వంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ, పూజా కైంకర్యాలు సాగాయి. భజనలు, విష్ణుసహస్రనామ పారాయణ జరిగింది. భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీతోపాటు అన్నదానం నిర్వహించారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: శ్రావణ శనివారం పురస్కరించుకుని పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా వేంకటేశ్వర స్వామి ఆలయాలలో విశేషపూజలు, అలంకరణలు చేశారు. వాసవి రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. సుప్రభాత సేవ, తోమాలసేవ, అభిషేకం, మహాభిషేకం నిర్వహించారు. తులసి తోరణాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. మమామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కైవార మఠంలో రథోత్సవం



విశేష పూజల్లో పాల్గొన్న భక్తులు

సిలికాన్ బీచ్ ప్రోగ్రామ్‌లో భాగస్వాములు కండి

ఎంపీ బ్రిజేశ్ చౌట



ఎస్‌బీపీ పోస్టర్ విడుదలలో ఎంపీ బ్రిజేశ్‌చౌట

బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సిలికాన్ బీచ్ ప్రోగ్రామ్‌లో భాగస్వాములు కావాలని సొంత ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని దక్షిణకన్నడ జిల్లా ఎంపీ బ్రిజేశ్‌చౌట అభిప్రాయపడ్డారు. ఈమేరకు బెంగళూరులో సిలికాన్ బీచ్ ప్రోగ్రామ్ (ఎస్‌బీపీ) పోస్టర్ విడుదల చేశారు. ఎస్‌బీపీ అంటే హోం కమింగ్ ప్లాట్‌ఫాం అన్నారు. తీర ప్రాంత కర్నాటక జిల్లాలకు వెనుతిరిగి వచ్చి ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. ఈ వేదిక ద్వారా తీరప్రాంత జిల్లాలో మార్పులు తీసుకురాదలిచామన్నారు. రెండేళ్లలో 40కుపైగా కొత్త కంపెనీలు కార్యాచరణ ప్రారంభించామని తద్వారా 8వేలకు పైగా ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. అనుభవం కల్గిన వృత్తి నిపుణులు వెనుతిరిగి రావాలన్నారు. 2వేలకుపైగా గ్లోబల్‌స్థాయి పరిశ్రమలు కల్గినవారు, పనిచేసే నిపుణులు ఉన్నారన్నారు. ఇటీవల ఓ సమీక్షలో 95శాతం మంది వృత్తి నిపుణులు తగిన అవకాశాలు సౌలభ్యాలు కల్పిస్తే వెనుతిరిగి వస్తామని అభిప్రాయపడ్డారన్నారు. వర్క్ వర్క్, 99 గేమ్స్ అండ్ రోబోసాఫ్ట్ వ్యవస్థాపకులు రోహిత్‌భట్ మాట్లాడుతూ.. ఎక్కువ కంపెనీలు భారత సిలికాన్ బీచ్‌కు తీసుకురావాలన్నారు.

ఎంపీ సుధాకర్‌పై కేసు సమంజసం కాదు

జడ్పీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి తదితరులు

బాగేపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు అభివృద్ధిపై దృష్టి సారించకుండా పోలీసుశాఖ ద్వారా ఎంపీ డాక్టర్ కే సుధాకర్‌పై తప్పుడు కేసు నమోదు చేయడం ద్వారా ఏపీ తరహా దుష్ట ద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు, ఎన్డీయే ప్రముఖుడు హరినాథరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో శనివారం ఫాంహౌస్‌లో ఎంపీ సుధాకర్ మద్దతు దారుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జీప్ డ్రైవర్ బాబు ఆత్మహత్య వివాదంలో సంబంధం లేని డాక్టర్ సుధాకర్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. పోలీసులు తమ తప్పును తెలుసుకుని ఎంపీ పేరు తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కాంగ్రెస్ మంత్రి, ఎమ్మెల్యేల చేతిలో కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. బాబు ఆత్మహత్యకు, ఎంపీ డాక్టర్ కే సుధాకర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎంపీ పరువుకు భంగం కలిగేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఒక్కలిగ సంఘం ప్రధాన కార్యదర్శి కోనప్పరెడ్డి మాట్లాడుతూ జీప్ డ్రైవర్ పనికోసం 40 లక్షల రూపాయలు లంచం ఇస్తారనడం ఎంతవరకు నమ్మడం సాధ్యమన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ వీ వెంకట శివారెడ్డి, తట్టహళ్ళి మద్దిరెడ్డి, నాగరాజురెడ్డి, జేపీ రెడ్డి, కేటీ వీరాంజనేయ, ఆ.న.మూర్తి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీబీపీ పోలీసులకు విద్యార్థుల రక్షాబంధన్



రాఖీ కడుతున్న విద్యార్థినులు



ఇండో టిబెటన్ పోలీసులతో విద్యార్థినుల బృందం

విజయపుర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణ సమీపంలోని సుండ్రళ్ళిలోని ఇందిరాగాంధీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులకు రాఖీ కట్టారు. పోలీసులకు తిలకం దిద్ది, హారతి ఇచ్చి రాఖీ కట్టి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఐటీబీపీ డీఐజీ అన్వర్ ఇలాహి, డిప్యూటి కమాండెంట్‌లు పీవీ సంతోష్, సిద్ధార్థ త్రిపాఠి, అసిస్టెంట్ కమాండెంట్ షబ్నం తదితర అధికారులు పాల్గొన్నారు.

పగలే సంప్ మోటారు చోరీ

సీసీ టీవీ ఫుటేజీలో గుర్తింపు



సీసీ టీవీలో రికార్డయిన దృశ్యం

చింతామణి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల చోరీలు అధికమయ్యాయి. అందులోనూ ప్రముఖ లే అవుట్‌లలో దొంగతనాలకు ప్రయత్నించి విఫలమైన వెంటనే రాజీవ్‌నగర్ లే అవుట్‌లో పట్టపగలే ఇంటి మెట్ల కింద అమర్చిన వేలాది రూపాయల విలువైన సంప్ మోటర్ చోరీ చేసి వెళ్లిన వ్యక్తి సీసీటీవీ ఫుటేజీలలో గుర్తించబడ్డాడు. గురువారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు బెంగళూరు రోడ్డు మీదుగా నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి వినాయకమోటార్స్ పక్క రోడ్డు నుంచి రెండోక్రాస్‌లో లాండ్రి పనిచేసే మంజుళా అనే మహిళ ఇంటి కాంపౌండ్‌లో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించి మెట్లకింద ఉన్న సంప్ మోటర్ పైప్‌లు, విద్యుత్ కనెక్షన్ తొలగించాడు. గోనెసంచిలో మోటర్‌తో భుజంపై పెట్టుకుని రాజీవ్‌నగర్ లే అవుట్ మెయిన్ రోడ్డువైపు వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. మంజుళా సాయంత్రం ఇంటికిరాగా నీరు వృథా అవుతుండడంతో పరిశీలించగా మోటర్ చోరీ అయినట్టు గుర్తించి వాపోయారు. ఏదేమైనా చోరీలకు అడ్డుకట్ట వేసేలా పోలీసుల గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా కళ్లలగర్ రథోత్సవం



అళగర్‌మలై ఆలయం నుంచి బయలుదేరుతున్న మహారథం

చెన్నై, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని అళగర్‌మలై వద్ద తిరుమాళిరుంజోలై, తెన్‌తిరుపతిగా కీర్తింపడుతున్న అష్టోత్తర శత వైష్ణవ దివ్య దేశాల్లో ఒకటైన కళ్లలగర్ ఆడి మాస రథోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఆడి ఉత్సవాలు ఈ నెల ఒకటిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ శ్రీదేవి, భూదేవి సమేత కళ్ళలగర్ పెరుమాళ్ వివిధ వాహనాల్లో విహరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన ఆడి రథోత్సవం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఇష్టదేవేరులతో సుందరేశపెరుమాళ్ ఉదయం 8.40 గంటలకు సర్వాలంకరణశోభితులై రథంలోని ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఉదయం 9 గంటలకు భక్తులు రథం మోకుతాళ్ళను పట్టుకుని లాగుతూ వెళ్ళారు. ఈ వేడుకల్లో మంగళవాయిద్యాల నడుమ చందనపు కలశాలను ఊరేగింపు తీసుకెళ్ళి పదినెట్టాంబడి కరుపణ్ణసామి ఆలయంలో భక్తులు సమర్పించారు. ఆ సందర్భంగా మేకపోతులు, కోళ్ళను బలులిచ్చి పొంగళ్లు పెట్టారు. మదురై జిల్లా ఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో సుమారు వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అళగర్‌మలైన నూపురగంగ రాక్కాయి అమ్మన్, ఆరాంపడైవీడు సోలమైల మురుగన్, మూలవర్ కళ్ళలగర్ పెరుమాళ్, పదినెట్టాంబడి కరుప్పణ్ణసామి తదితర ఆలయాల వద్ద భక్తులు నేతీ దీపాలు పట్టుకుని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ రథోత్సవంలో మంత్రి మూర్తి, తక్కర్ వెంకటాచలం, డిప్యూటీ కమిషనర్ రామసామి, మేలూరు ఎమ్మెల్యే పెరియపుల్లాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు మదురై, దిండుగల్, తేని, విరుదునగర్, రామనాథపురం, శివగంగ, తిరునల్వేలి, చెన్నై తదితర జిల్లాల నుండి, పొరుగు రాష్ట్రం కేరళ నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.

వర్గీకరణలో జాప్యంపై ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న హరాడి మంజునాథ్ తదితరులు

మహదేవపుర, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కులవర్గీకరణ అమలులో జాప్యం సరికాదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరాడి హెచ్‌వీ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. ఈనెల 16న నిర్వహించే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోకుంటే పోరాటం చేస్తామన్నారు. నియోజకవర్గంలోని హరాడిలో ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటైన సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ ఎస్సీలకు రిజర్వేషన్‌లు కల్పించేందుకు కులవర్గీకకరణ చేసేందుకు జస్టిస్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలో కమిషన్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిందని, సుమారు 1,765 పేజీలతో నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించిందన్నారు. అయినా ఈ అంశాన్ని కేబినెట్‌లో ఇంతవరకు ప్రస్తావించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి ఈనెల 16న మంత్రివర్గ సమావేశంలో 8శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో న్యాయవాదులు విక్రమ్, సంజయ్‌తోపాటు కన్నలి కేఎం సురేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల ఎంపిక.. ఓ సవాల్

నటి మేఘనారాజ్



నటి మేఘనారాజ్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దుస్తుల ఎంపిక ఒక సవాల్‌లాంటిదని అన్ని రకాల బట్టలు అన్ని కాలాల్లో ధరించడం సాధ్యం కాదని సంప్రదాయంతో విలాసవంతమైన దుస్తుల పట్ల యువత ఆసక్తి చూపుతోందని ప్రముఖ నటి మేఘనారాజ్ అభిప్రాయపడ్డారు. ఇందిరానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో హౌస్ ఆఫ్ ఇండి కన్యా బోటిక్‌ను మేఘనారాజ్ ప్రారంభించారు. నాలుగైదేళ్లకుపైగా బోటిక్ నిర్వహణలో అనుభవంతో ప్రత్యేక షోరూంను ప్రారంభించినట్టు వ్యవస్థాపకురాలు శిరీషా నిమ్మగడ్డ అభిప్రాయపడ్డారు. యువత ఆసక్తి చూపే డిజైన్లను అందుబాటులో ఉంచామన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు చేయూత



డీడీ అందజేస్తున్న ధర్మస్థళ సంస్థ నిర్వాహకులు

దొమ్మసంద్ర, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా జిగణి హోబళి మంటప పంచాయతీ పరిధిలోని మంటప పంచాయతీ మళెనల్లాసంద్ర గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె కింద రూ.1.50 లక్షల డీడీని అందచేశారు. వీరాంజనేయ ఆలయ ట్రస్టు అధ్యక్షుడు నవీన్, ట్రస్టు నిర్వాహకులకు డీడీని ఇచ్చారు. ఆనేకల్ తాలూకా యోజనాధికారి నాగేశ్‌గౌడ మాట్లాడుతూ ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంఘం ఎన్నో ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా మారుమూల గ్రామాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తోందన్నారు. వీరాంజనేయ దేవస్థానం ట్రస్టీ అధ్యక్షుడు మంటప పంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు నవీన్, స్వయం సంఘాలకు చెందిన రత్నమ్మ, కళావతి, సేవా ప్రతినిధి గాయత్రి పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలు అందరికీ అందాలి

గ్యారెంటీ పథకాల కమిటీ ఆనేకల్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలకృష్ణారెడ్డి

బొమ్మనహళ్ళి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు అందరికీ అందాలని గ్యారెంటీ పథకాల అమలు కమిటీ ఆనేకల్ తాలూకా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. కూడ్లుగేట్‌లో గ్యారెంటీ పథకాల అమలు కమిటీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల ప్రచారం వేళ ఇచ్చిన హామీలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తోందన్నారు. గ్యారెంటీ పథకాలతోపాటు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. శక్తి గ్యారెంటీ వల్ల నిత్యం బస్సులలో ఉచిత ప్రయాణం సాధ్యమవుతోందన్నారు. గృహలక్ష్మీ పథకం ద్వారా గృహిణికి రూ.2వేలు, అన్నభాగ్య ద్వారా 10 కిలోల బియ్యం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఇంకా యువనిధి ద్వారా యువతకు నిరుద్యోగ భృతి అందుతోందన్నారు. కార్యక్రమంలో గ్యారెంటీ పథకాల అమలు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రేవణ్ణ, ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ, స్థానిక నాయకులు బాబురాజు, గ్యారెంటీ పథకాల కమిటీ బొమ్మనహళ్ళి అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షుడు కే వాసుదేవరెడ్డి, మంజునాథ్, నాగరాజు, శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,774	45,086
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	38,569	31,831
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	104.70



తమలపాకుల అలంకరణలో మద్దటనూరు అభయాంజనేయస్వామి

పాహిమాం.. పవన పుత్రా!

కంప్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు రద్దీగా మారాయి. కంప్లి అంజనాద్రి ఆంజనేయ స్వామి, హంపిలోని యంత్రోద్ధారక ఆంజనేయస్వామి, ముద్దటనూరు ఆంజనేయస్వామి, కుడితిని అభయ ఆంజనుయ స్వామికు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





కంప్లిలో వెండికవచ అలంకారం, అంజనాద్రి కొండపై..

ప్రేమించి మోసం చేశాడు..!

● ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి నిరసన



ప్రియుడి ఇంటి వద్ద యువతి నిరసన

కంప్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ తన ప్రేమికుడి ఇంటి ముందు ప్రియురాలు నిరసన చేపట్టింది. కంప్లి తాలుకాలోని హోసనెల్లూడి గ్రామంలో ప్రేమలో మోసపోయిన తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ యువకుడి ఇంటి ముందు రాత్రింబవళ్లు ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నందీష్, కోట్బాల్ గ్రామానికి చెందిన తనను ఐదు సంవత్సరాలుగా ప్రేమించాడని పేర్కొంది. వివాహం చేసుకుంటానని హామీనిచ్చిన నందీష్ మాట తప్పాడని వాపోయింది. నందీష్ కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకే తనను నిర్లక్ష్యం వహిస్తున్నాడని, కులం కారణంగానే వారు వ్యతిరేకిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ప్రేమించినప్పుడు అడ్డు రాని కులం ఇప్పుడు ఎలా అడ్డొచ్చిందని యువతి ప్రశ్నించింది. ఈ సంఘటన తరువాత నందీష్ కుటుంబీకులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. పెళ్లి చేసుకునే వరకు పోరాటం కొనసాగిస్తానని ఆ యువతి హెచ్చరించింది. న్యాయం జరిగే వరకు విశ్రమించబోనని పేర్కొంది.

పేదల ప్రేమకు బానిస కాయకయోగి నులి చందయ్య

● తాళ్లు నేసి అభాగ్యుల ఆకలి తీర్చిన మహనీయుడు ● జయంత్యుత్సవంలో కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న ముండరిగి నాగరాజు

బళ్లారి సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాయకయోగి నులి చందయ్య కాయక పేదల ప్రేమకు బానిస అని, తాను సంపాదించిన ధనంలో అధిక భాగం పేదల బాగు కొరకే ఖర్చు పెట్టారని బాబు జగ్జీవన్‌రామ్ లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ముండరిగి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నులి చందయ్య జయంతి కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. 12వ శతాబ్దపు వచనకర యుగం నాటి కార్యకర్తలు సమాజాభివృద్ధికి గొప్ప కృషి చేశారని, మరే ఇతర సమాజం తమదిగా గుర్తించలేని విధంగా పాటు పడిన వారిలో ఆయన ఒకరన్నారు. సమాజ అభ్యున్నతికి సామాన్యప్రజల అభ్యున్నతికి కృషి చేసిన వివిధ ప్రముఖుల సిద్ధాంతాలను స్వీకరించడం ద్వారా మనమందరం మంచి జీవితాన్ని గడపాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవస్థీకృతంగా ఉండాలని, దుర్గుణాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ చందయ్య గొప్ప కాయక యోగి అని, ఆయన తన వృత్తిపట్ల అపారమైన గౌరవం కలిగి ఉండేవారన్నారు. తన వృత్తిద్వారా సంపాదించిన ఆదాయంలో కొంత బాగాన్ని పేదల కోసం ఖర్చు చేసిన మహనీయుడన్నారు.

కర్ణాటక రాష్ట్ర అక్కమహాదేవి మహిళా విశ్వవిద్యాలయం లెక్చరర్ గంగాధర్ మాట్లాడుతూ నులి చందయ్య క్రీశ. 1.130 ప్రాంతంలో విజయపుర జిల్లాలోని శివనిగే గ్రామంలో జన్మించారన్నారు. తరువాత ఆయన బసవన్న పనిచేసిన ప్రాంతమైన కల్యాణానికి వచ్చారు. అక్కడ ఆయన ఇతర నారల నుంచి తాళ్ళు నేసి ధనం సంపాదించేవారన్నారు. ఆయన సందేశ్వర లింగ అనే మారుపేరుతో దాదాపు 48పద్యాలను రచించారు. ఈసందర్భంగా కొరవ సమాజం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, గౌరవాధ్యక్షుడు శంకరప్ప, కన్నడ సాంస్కృతిక శాఖ నాగరాజు,సంఘం నాయకుడు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఊరేగింపు



రాయచూరులో ఊరేగింపు

కాయకయోగి నులిచందయ్య జయంత్యుత్సవంలో భాగంగా నగరంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పూర్ణ కుంభాలతో, సాంస్కృతిక బృందాలు అందరి దృష్టిని ఆకర్షించారు. నగరంలోని కొరవ కమ్యూనిటీ హాల్ ఆవకణ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కొరవ వీధి సుంకలమ్మ దేవాలయం, కౌల్‌బజార్ మెయిన్ రోడ్డు వాల్మీకి భవన్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం చేరుకుంది. సమాజ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జొన్న బకాయిలు విడుదల చేయండి

● ఎమ్మెల్యే నాగేంద్రకు రైతు సంఘం వినతి

బళ్లారి సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసిన రూ.78కోట్ల బకాయి సొమ్మును తక్షణమే విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దరూర్ పురుషోత్తమగౌడ మాట్లాడుతూ వేసవిలో ప్రభుత్వం జిల్లాలో 12కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేసిందన్నారు. 3,739 మంది రైతుల నుంచి రూ.3,371 ధరతో హైబ్రిడ్ జొన్నలు,రూ.3,421తో తెల్లజొన్నలు అధికారులు కొనుగోలు చేశారన్నారు. రైతులకు మొత్తం రూ.78కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రుతుపవన వర్షాలు ఇప్పటికే ప్రారంభమైయ్యాయి. తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు నీరు విడుదల చేసి నెల రోజులు కావస్తోంది. సాగు పనులకు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే బకాయి సొమ్ము విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందరిచూపు.. ప్రైవేట్ కాలేజీల వైపు..!

● ప్రభుత్వ కాలేజీల్లో పడిపోయిన అడ్మిషన్లు ● సౌకర్యాలలేమి, అధ్యాపకుల కొరతే కారణమంటున్న నిపుణులు

రాయచూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పీయూ కళాశాలల్లో ప్రస్తుతం ఏడాదిలో ప్రవేశాలు ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం ఏడు తాలూకాల్లో 49 ప్రభుత్వ పీయూ కళాశాలలుండగా వాటిలో ఒక్క రాయచూరు తాలూకాలోనే 10 కళాశాలలు ఉన్నాయి. వాటిలోని 5 కళాశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయినట్లు గణాంకాలు పేర్కొంటున్నారు. 2024-25 విద్య సంవత్సరంలో మొత్తం జిల్లాలోనే 49 కళాశాలల్లో 19,752 పీయూ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు జరిగాయి. ఈ ఏడాది 2025-26వ విద్య సంవత్సరానికి సంబంధించి ఆ సంఖ్య ఒక్క సారిగా 11,747కు పడిపోవడంతో పీయూ విద్య శాఖ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 8 వేలకు పైగా అడ్మీషన్‌లు తగ్గిపోవడంతో అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి తలెత్తింది. అధ్యాపకుల కొరత వల్ల బోధనకు ఆటంకం ఏర్పడుతుండడమే ఇందుకు ప్రధాన కారణంగా పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి అనేక కళాశాలల్లో ప్రయోగ శాలలు సరిగ్గా లేవని ప్రాక్టికల్స్ నిర్వహించడంలో నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు ముగ్గు చూపుతునట్లు అభిప్రాయపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ పీయూ కళాశాలలో సౌకర్యాలు మెరుగు పరచడం ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడం వంటి చర్యలు చేపట్టకపోతే భవిషత్తులో అడ్మిషన్లు మరింతగా పడిపోయే ప్రమాదం ఉందని పలువురు విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.



తగినంత మంది విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న బెంచీలు

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్నపంచాయతీ సభ్యుడు గిరీష్

కంప్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మెట్రి గ్రామ పంచాయతీ సభ్యులు నేనికి గిరీష్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లోని విద్యార్థులకు 1050 భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సభ్యులు హెచ్ కుమారస్వామి మాట్లాడుతూ మెట్రి గ్రామ ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను అందించడం ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ స్పందిస్తూ, నేనకి గిరీష్ గ్రామాభివృద్ధికి రాత్రింబవళ్లు కృషి చేశారన్నారు. గ్రామంలోని పేద విద్యార్థులకు వారి విద్యకు ఆయన ఎల్లప్పుడూ సహాయం చేశారని తెలిపారు. అలాగే గ్రామంలో ఎవరికైనా ఆరోగ్య సమస్య వుంటే ముందుకొచ్చి సహకారాలు చేపడుతారన్నారు. సమాజ సేవలు చేయడానికి మరింత ముందుకు రావాలని కోరారు. గ్రామంలోని హోన్నళ్లి సిద్దప్ప, హైస్కూలు, శివపుర, చిన్నాపుర, ఉప్పరహళ్లి గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు ఆయన భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు హెచ్ కుమారస్వామి, ప్రముఖనాయకులు హోన్నళ్లి, గంగాధర, హెచ్ జగదీష్, మల్లికార్జున, గణేష్, కొండప్ప, కుశాలప్ప, రమేష్, శాంతకుమార్, పరశురామ, పంపాపతి, శంకర్, మాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోండి

● పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గణేశ్



తాలుకా పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేశ్ సూచించారు. శనివారం ముద్దాపురం పరిధిలోని హోస్పేట బైపాస్ రోడ్డులోని అన్ని సౌకర్యాలతో కూడిన తాలుకా పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్లి తాలుకా కేంద్రంగా ఏర్పడిన తరువాత పట్టణంలోనే నీటిపారుదల శాఖ సమీపంలోని భవనంలో తాలుకా పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు కోట్లాది రూపాయల వ్యయంతో అన్ని సౌకర్యాలతో కూడిన భవనం నిర్మించబడిం దన్నారు. అధికారుల సహకారంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. కంప్లి ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి కొన్ని నెలల్లో పూర్తిగా పూర్తవుతుందన్నారు. జిల్లా స్థాయి ఉత్పత్తి ప్రదర్శన, సంజీవిని మాసోత్సవం ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. జడ్పీ ప్లానింగ్ ఆఫీసర్ వాగేష్, టీపీఏ అడ్మినిస్ట్రేటర్ పరిమళ, ఈఓ శ్రీకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లనగౌడ, పంచాయతీ అధ్యక్షుడు సోమేశ్వరి, సభ్యులు ఏఈఈ హరీష్, సీఆర్ హనుమంత, ఏపీఎంసీ అధ్యక్షులు హబీబ్ పాల్గొన్నారు.

ఇంటింటా రక్షాబంధన్ వేడుకలు

బళ్లారి సిటీ/రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రక్షా బంధన్ వేడుకలను ఉభయ జిల్లాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నాదమ్ముళ్లకు రాఖీ కట్టి సోదరభావం చాటుకున్నారు. నగరంలోని వాసవి విద్యాలయ విద్యార్థులు పాఠశాలలో ఆనందంగా రక్షా బంధన్‌ను జరుపుకున్నారు. విద్యార్థినులు పలువురు విద్యార్థులకు రాఖీ కట్టి వేడుకలు జరుపుకున్నారు. కంటోన్మెంట్ రోడ్‌లోని శాంతిధామ్‌లో రక్షా బంధన్‌ను జరుపుకున్నారు. విద్యార్థులు మానవత్వం,ప్రేమ కురుణ యొక్కసందేశాన్ని పంచుకున్నారు. వాసవి కిండర్‌గార్డెన్ పాఠశాలలో చిన్నారులు అబ్బాయిల చేతులకు రాఖీ కట్టి సోదరులు, సోదరీమణుల మధ్యప్రేమ బంధం యొక్క సందేశాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించారు. పాఠశాలలోని విద్యార్థులతో ఇటువంటి పండుగను జరుపుకోవడంతో సంప్రదాయాలు చిరకాలంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్కలు

రైతులకు న్యాయం చేస్తాం: ఎంపీ



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ తుకారామ్

కంప్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు భూములు పోగొట్టుకున్న కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, వేణి వీరాపురం, సిద్దమ్మనహళ్లి, ఎర్రంగలి, కోలుగల్లు గ్రామాల రైతులకు న్యాయం చేకూరుస్తానని ఎంపీ తుకారామ్ హామీనిచ్చారు. శనివారం కుడితినిలో 966 రోజులుగా నిరసన చేపడుతున్న రైతుల వద్దకు వెళ్లి ఆయన మాట్లాడారు. 2010లో బ్రాహ్మణి, లక్ష్మీ మిత్తల్, ఎస్ఎండీసీ పరిశ్రమలకు 12500 ఎకరాలకు పైగా అప్పుడున్న బీజేపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ సమయంలో భూములు ఇచ్చిన రైతులు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని అలాగే త్వరలోనే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ అప్పుడు వుండిన ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. గత కొన్ని రోజుల క్రితమే కేంద్రమంత్రులు కుమారస్వామితో ఢిల్లీలో మీకు జరిగిన అన్యాయం భూములు పోగొట్టుకున్న రైతన్నలు విషయంపై చర్చించామన్నారు. కాలుష్యం ఏర్పడకుండా ఎస్ఎండీసీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. బ్రాహ్మణి మిత్తల్ ఈ రెండు పరిశ్రమలు ఏర్పాటు విషయం త్వరలోనే ముఖ్యమంత్రితో అంతలోపు గానే ముఖ్యమంత్రి కార్యదర్శికి ఫోన్‌రూపంలో సంప్రదించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. తదనంతరం రైతుల ప్రముఖులు బసవరాజుతో కూడా ముఖ్యమంత్రిలతో మాట్లాడించారు. ఈ సారి బెంగళూరులో జరిగే సమావేశంలో భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయం చేకూర్చి ఒక నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 25 గానీ, 26 గానీ సమావేశానికి తేదీలు ఇచ్చే అవకాశం వుందని తెలిపారు. రైతు సంఘం నాయకులు బసవరాజు, సత్యప్ప, జంగ్లీసాబ్, తిప్పేస్వామి, సంపత్, రైతన్నలు మాట్లాడుతూ పరిశ్రమలకు భూములు పోగొట్టుకున్న ఏడు గ్రామాల రైతుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని ఎన్నో రోజులుగా ఉద్యోగాలు లేక పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. భూములకు రేట్లు సరిపడా చేయండి లేకపోతే 50 శాతం భూములను సరిచేసి ఇవ్వండి లేకపోతే రైతుల భూములు రైతులకు ఇచ్చేలా చేయండని ఎంపీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, సత్తిబాబు జంగ్లిసాబ్, తిప్పేస్వామి, సంపత్, అంజనప్ప, శ్రీధర్, రాజశేఖర్ సత్యప్ప దొడ్డ బసప్ప, బీసన్న, పల్లెద ప్రభు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



అర్జీలు అందజేస్తున్న ప్రజలు

రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక శిబిరం

హోసూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీకి సంబంధించి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రజలనుంచి ఫిర్యాదులు అందుకున్నారు. కొత్తకొండపల్లి పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తగా రేషన్‌కార్డులకోసం 73మంది అర్జీలు అందచేశారు. రేషన్‌కార్డులలో కొత్తపేర్లు చేర్చడం, సవరణలు, చిరునామాలలో మార్పులు చేర్పులు, ఫోన్ నెంబర్ల సవరణ వంటి వాటికి అర్జీలు సమర్పించారు. అర్జీలను పరిశీలించి కొత్త రేషన్‌కార్డులను రెండు నెలల్లో జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారి దయాబ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని వీర్ నియామక ర్యాలీకి రెండోరోజు 860 మంది

రాయచూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సైన్యంలో భర్తీకి చేపట్టిన అగ్ని వీర్ నియామక ర్యాలీకి రెండవ రోజు శనివారం 860 మంది అభ్యర్థులు హాజరైయ్యాయు. 6 జిల్లాలకు చెందిన అభ్యర్థులకు దేహదారుడ్య పరీక్షలను నిర్వహించారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి రైళ్ల ద్వార నగరానికి చేరుకుంటున్న అభ్యర్థులకు స్థానిక మాజీ సైనికుల సంఘం ప్రతినిధులు దారి చూపించడం విశేషం. సైన్యం భర్తీ కోసం వచ్చిన వారిని తమను తాము పరిచయం చేసుకుంటు ర్యాలీ ఎక్కడ జరుగుతున్నది వారికి వెడది చేసిన ప్రాంతం ఎక్కడ అనే విషయాలు వివరిస్తు వారికి సహాయ సహకారాలు అందజేశారు.



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు

ప్రత్యంగిరాదేవికి క్షీరాభిషేకం

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఒరప్పం గ్రామంలోని ఆదిశక్తి ప్రత్యంగిరాదేవికి 1008 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. కొంత మంది భక్తులు మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా వివిధ రకాల వేషాలు ధరించారు. మహిళలు కళశాలతో ఊరేగారు. అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు.

పెద్ద మారియమ్మన్ ఆలయంలో...

సుమారు 300 సంవత్సరాల చరిత్ర గల పెద్దమారియమ్మన్ ఆలయంలో ఆడిపూరత్ ఉత్సవంలో భాగంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. బక్తులు పొంగళ్లు సమర్పించారు. పెరుల్‌నగర్ సహా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నర్సులకు ఉద్యోగావకాశాలు

పెరంబూర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భూటాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు రెండేళ్ల అనుభవం కలిగి బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులైన 23 నుంచి 45 ఏళ్ల లోపున్న మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2 నుంచి ఐదేళ్ల పని అనుభవం ఉన్న వారికి రూ.65,000, 6 నుంచి 10 ఏళ్ల అనుభవం కలిగిన వారికి రూ.73,000, పదేళ్ల పైబడి అనుభవం ఉన్న వారికి రూ.86,000 వేతనంగా అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://forms.gle/JS2b341tf2tcpJn56 అనే లింక్‌లో స్వీయ వివరాలు పూర్తిచేసి, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను ఈనెల 18వ తేదిలోపు పంపించవచ్చు. వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్, 6379179200, 044-22502267 అనే నెంబర్లను సంప్రదించవచ్చని అధికారులు ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధన



సిరుగుప్ప, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నట్లు తాలుకా బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం విలేఖరులతో మాట్లాడిన ఆయన సిరుగుప్ప పట్టణం బళ్లారి రోడ్డు మార్గంలో వెలసిన రాఘవేంద్రస్వాముల 354వ ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహి స్తున్నామన్నారు. ఆదివారం పూర్వారాధన, సోమవారం మధ్యారాధన, 12వ తేదీ మంగళవారం ఉత్తరారాధన మహోత్సవాలు నిర్వహిస్తారు. 12వ తేదీ రాఘవేంద్రస్వాముల రథోత్సవం జరపనున్నామన్నారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర స్వాముల ఆదేశాల మేరకు పూజలు చేపడతామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.